




కర్నూలులోని పాత ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

సహనం, సేవా గుణంతో జీవించాలి

- ముస్లిం మత పెద్దల ఉద్బోధనలు
- మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ఘనంగా బక్రీద్ వేడుకలు

కర్నూలు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సహన శీలత, సేవాగుణం, త్యాగ నిరతితో జీవించాలని, ఇదే బక్రీద్ పండుగ లోని పరమార్థమని ముస్లిం మతపెద్దలు ఉద్బోధించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకు న్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద మతపెద్దలు ఈద్ నమాజ్‌లు చేయించి, దైవ సందేశాన్ని అందించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని ఇస్లాం బోధిస్తుందని తెలి పారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ దువా చేశారు. నమాజ్ అనంతరం ముస్లింలు 'ఈద్ ముబాకర్' చెప్పుకున్నారు.

నగరంలో నాలుగు ఈద్గాలు..

కర్నూలు నగరంలో నాలుగు ఈద్గాలు, సుమారు 150 మసీదుల్లో ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. కొత్త బస్టాండు సమీపంలోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ సలీం బాషా, సంతోష్‌నగర్‌లోని కొత్త ఈద్గాలో మౌలానా మన్సూర్ ఖ్వాస్మి, గడ్డ వీధిలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ హాఫిజ్ మంజూర్ అహ్మద్, జోహరాపురం ఈద్గాలో హసీమ్ జామియా మతపెద్దలుగా వ్యవహరిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాత ఈద్గాలో ప్రార్థనలు చేసి మత పెద్దలకు, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

పాత ఈద్గాలో మత పెద్ద సయ్యద్ సలీంబాషా ప్రసంగం



కర్నూలులోని పాత ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఈగల్ ఆన్ డ్యూటీ..!

కర్నూలు క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నేరాలను ఎదుర్కొవడానికి మాదకద్రవ్యాల నిరోధక విభాగం ఈగల్ (ఎలైట్ యాంటి-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)ను ప్రారం భించింది. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని నిరోధించేం దుకు 'ఈగల్' పనిచేస్తోంది. దీన్ని కాల్ సెంటర్ 24గంటలు అందుబాటులో ఉంటుంది.

మాదక ద్రవ్యాల నిరోధక విభాగమే..

ఈగల్ అంటే మాదక ద్రవ్యాల నేరాలను ఎదుర్కొనేందుకు మాదక ద్రవ్యాల నిరోధక విభాగమే ఈగల్. సోషల్ మీడియా పర్యవేక్షణ, అనుమానాస్పద లావాదేవీల గుర్తింపు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారుల నెట్‌వర్క్, ఆన్‌లైన్‌లో జరిగే డ్రగ్స్ విక్రయాలను గుర్తించి అడ్డుకోవడం, డార్క్‌వెబ్‌పై నిఘా వంటి చర్యలతో పాటు వివిధ విభాగాల ద్వారా సమాచార సేకరణ, స్మగ్లర్ల ప్రొఫైలింగ్, వారి ఆర్థికమూలాల విశ్లేషణ ద్వారా డ్రగ్స్‌ను రాష్ట్రం నుంచి సమూ లంగా నిర్మూలించడంపై ఈగల్ పనిచేస్తుంది. కొరియర్ల స్మగ్లర్లు నుంచి స్వాధీనం చేసుకునే సెల్‌ఫోన్లు, వివిధ పరికరా లను డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా విశ్లేషించి కింగ్‌ఫిన్‌లను ప ట్టుకుంటారు. మారుమూల ప్రాంతాల్లో జరిగే గంజాయి సాగు ప్రాంతాల్ని డ్రోన్లు, శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించి ధ్వంసం చేయనుంది. రాష్ట్ర సరిహద్దులు, గంజాయి రవాణా చేసే మార్గాల్లో కృత్రిమ మేధ ఆధారిత సీసీ కెమెరాలు, ఫేషియల్ రికగ్నే షన్ ఆటోమేటెడ్ నెంబర్ ప్లేట్ల రికగ్నేషన్ వంటివి ఉపయోగిస్తారు. అమరావతిలో ప్రధాన కార్యాలయం ఉంది. ఈగల్‌లో 26 నియం త్రణ కణాలు, ప్రత్యేక కోర్టులు ఉన్నాయి.



పట్టుబడిన గంజాయి (ఫైల్ ఫొటో)

జిల్లాలో ఈగల్ పాత్ర

జిల్లా వ్యాప్తంగా ఈగల్ టీం ఏర్పాటైంది. ఓ ఎస్ఐతో పాటు ఐదారు మంది ఈగల్ టీమ్‌లో పని చేస్తున్నారు. విద్యార్థులు, యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా రక్షించడం, వివిధ కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1972 ద్వారా సమాచారం సేకరించడం, మాదక ద్రవ్యాల బారిన పడిన వారికి పునరావాస కేంద్రాలను తరలించడం వంటి ఈగల్ టీం ముఖ్య ఉద్దేశం.

కాల్ సెంటర్ 24 గంటలు..

డ్రగ్స్, గంజాయి ముఠాలపై సమాచారం ఇచ్చేందుకు టోల్ ఫ్రీ నెంబర్.1972ను ఏర్పాటు చేసింది. అమరావతి ప్రధాన కేంద్రంలోని కాల్ సెంటర్ 24 గంటలు పనిచేస్తుంది. ఈగల్, నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, జిల్లా నార్కోటిక్స్ కంట్రోల్ విభాగాల్లో కలిపి మొత్తం 459 మంది సిబ్బంది పనిచేస్తారు. 249 మందిని ప్రధాన కార్యాలయానికి, 66 మందిని నార్కోటిక్స్ స్టేషన్‌కు, 114 మందిని జిల్లా విభాగాలకు కేటాయించారు. వీరందరినీ పోలీసు శాఖలోని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకుంటారు. అనంతరం వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. ఈ విభాగంలో పని చేసే వారికి 30 శాతం అదనంగా అలవెన్సు కూడా ఇవ్వనున్నారు. 12మంది కాల్ టేకర్లతో కూడిన టోల్‌ఫ్రీ, సెంట్రల్ కంట్రోల్ రూం కమ్యూనికేషన్, వేగవంతమైన ప్రతిస్పందన సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది. పారదర్శకతను నిర్ధారించడానికి, దుర్వినియోగాన్ని నిరోధించడానికి, సీజ్ చేయబడిన మాదక ద్రవ్యాలను సీసీ టీవీ నిఘాతో కూడిన సెంట్రల్ డిపాజిటరీ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. రాష్ట్రస్థాయిలో నాలుగు టాస్క్‌ఫోర్సు బృందాలు ఉంటాయి. అమరావతిలో నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్‌ను రాష్ట్రమంతటా పరిధి కల్పించారు. ఇక్కడి సిబ్బంది ఏపీలో ఎక్కడైనా సరే డ్రగ్స్, గంజాయి సంబంధిత కేసుల నమోదు, దర్యాప్తు చేయొచ్చు. డీఎస్పీ స్థాయి అదికారి ఈ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా వ్యవహరిస్తారు.

- డ్రగ్స్, గంజాయి వాడకంపై ప్రత్యేక దృష్టి
- సోషల్ మీడియా పర్యవేక్షణ
- డార్క్ వెబ్‌పై నిఘా
- ఆన్‌లైన్‌లో జరిగే డ్రగ్స్ విక్రయాల గుర్తింపు
- స్మగ్లర్ల ప్రొఫైలింగ్, వారి ఆర్థికమూలాల విశ్లేషణ
- ఉమ్మడి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు
- టోల్ ఫ్రీ నెంబర్ 1972

నిషేధం మాటున వాడకం



జిల్లాలో డ్రగ్స్ వినియోగం చాపకింద నీరులా సాగుతుంది. చెన్నై, బెంగుళూరు ప్రాంతాల నుంచి మత్తుమందు జిల్లాకు దిగుమతి అవుతున్నట్లుగా తెలుస్తుంది. ఇటీవల జిల్లాలో గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. రెండేళ్ల క్రితం తాలుకా సీఐ ఓగంజాయి బ్యాచ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే సుమారు 30మందికి పైగా కళాశాల విద్యార్థులు గంజాయి వాడుతున్నట్లుగా గుర్తించి ఆశ్చర్యానికి గురయ్యారు. గంజాయి వాడకం ముఖ్యంగా ప్రధాన వైద్య విభాగంలోని విద్యార్థులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల విజిలెన్స్ అధికారులు కూడా దాడులు చేస్తే కొన్ని మందుల షాపుల్లో కూడా మత్తును కలిగించే కొన్ని డ్రగ్స్‌ను ఎలాంటి ప్రిస్కిప్షన్ లేకుండానే ఇస్తున్నట్లు గుర్తించి వారిపై కేసులు కూడా నమోదు చేశారు.

వివిధ కార్యక్రమాల నిర్వహణ

మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు వివిధ కార్యక్ర మాలను జిల్లాలో నిర్వహిస్తున్నారు. సిబ్బందికి మాదకద్రవ్యాల వినియోగం యొక్క సంకేతాలను ఎలా గుర్తించాలో వివరిస్తారు. మాదక ద్రవ్యాల సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించడం, వారిని ఎలా సంప్రదించాలో వివరిస్తున్నారు. మాదక ద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. గంజాయి పెంచిన.. పంచినా.. పీల్చినా నేరం అని దానికి శిక్షలు కూడా ఉన్నాయని సిబ్బంది వివరిస్తున్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలు మే 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 5,600 మంది హాజరు కాగా, 2541 మంది ఉత్తీర్ణులై 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4303 మంది విద్యార్థులు హాజరు కాగా, 2583 మంది ఉత్తీర్ణులై 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఒకేషనల్ కేటగిరిలో ఇంటర్ ఫస్టియర్‌లో 512 మందికి గాను 286 మంది పాసై 56 శాతం ఉత్తీర్ణత, అలాగే ద్వితీయ సంవత్సరంలో 509 మందికి గాను 361 మంది పాసై 31 శాతం ఉత్తీర్ణత సాధించారు. రీవెరిఫికేషన్ కోసం ఒక్కొక్క సబ్జెక్టుకు ఫీజు రూ.1300, రీకౌంటింగ్ కోసం రూ.260 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 13వ తేదీ చివరి గడువు అని ఆర్ఐవో సురేష్‌బాబు తెలిపారు.

ఏళ్ల తరబడి అక్కడే..!

- కదలని జూనియర్ అసిస్టెంట్లు
- అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- సహకరిస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్
- బదిలీలకు ఆదేశాలు జారీ చేసిన డీఎంఈ
- ఫెవికాల్ వీరులు కదిలేనా?



కర్నూలు హాస్పిటల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్, మెడికల్ కాలేజీ పరిపాలన విభాగంలో కొందరు జూనియర్ అసిస్టెంట్లు ఉద్యోగం చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకేచోట తిష్ట వేసి కూర్చున్నారు. జూనియర్ అసి'టెంట్లు' వేసుకొని కూర్చున్నట్లు ఉన్నది పరిస్థితి. కొందరు ఒకే సీటులో అతుక్కుపోయి అక్రమాలు చేస్తున్నారు. కర్నూలు జీజీహెచ్ పరిపాలన విభాగంలో ఏకంగా 35 ఏళ్లుగా ఓ జూనియర్ అసిస్టెంట్ కార్యాలయంలో పని చేస్తున్నారు. మరో జూనియర్ అసిస్టెంట్ కూడా ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేశారు. సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్న తులు వచ్చినా వాటిని తీసుకోకుండా ఇక్కడే కొనసాగుతున్నారు. ఇటీవల ఓ జూనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి వచ్చినా తీసుకోకుండా ఇక్కడే పనిచేస్తున్నారు. ఇక కొందరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్ అండతో ఆదాయం వచ్చే ఒకే సీటులో కొనసాగు తున్నారు. ఇక మెడికల్ కాలేజీలో కూడా 33ఏళ్లుగా జూనియర్ అసిస్టెంట్ చక్రం తిప్పుతున్నారు. మరికొందరు కూడా 30ఏళ్లుగా పైగా ఉన్నారు. ఓ అటెండరు స్థాయి ఉద్యోగి కూడా ఇక్కడ ఏళ్ల తరబడి చక్రం తిప్పుతున్నారు. ప్రస్తుతం కొనసాగే బదిలీ పర్వంలోనైనా ఈ ఫెవికాల్ వీరులు కదిలేనా అన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సర్వీసు, పోస్టుల వివరాలను..

ఈ నెల 10వ తేదీ జూనియర్ అసిస్టెంట్లు, ఇతరులు బదిలీ దరఖాస్తులు, సర్వీసు వివరాలను, పోస్టుల వివరాలను డీఎంఈ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశిం చారు. దీని ఆధారంగా జూనియర్ అసిస్టెంట్లకు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి అంతర్గత బదిలీలు జరగనున్నాయి. డీఎంఈ అకస్మిక నిర్ణయంపై ఏళ్ల తరబడి పాతుకుపోయిన జూనియర్ అసిస్టెంట్ల గొంతులో వెలక్కాయ పడినట్లయింది.

అంతర్గత బదిలీలకు ఆదేశాలు

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉన్న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఐ-హాస్పిటల్, క్యాన్సర్ హాస్పిటల్‌లో జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, స్టెనోలకు జిల్లా కేంద్రంలోనే అంతర్గత బదిలీలు నిర్వహిం చాలని డీఎంఈ డా.నరసింహం శనివారం ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్లకు తప్పనిసరిగా ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి బదిలీ చేయాలన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో 15 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు రికార్డు అసిస్టెంట్లు, ఒక టైపిస్టులు ఉండగా.. కర్నూలు మెడికల్ కాలేజీ లో 15మంది జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, కంటి ఆసుపత్రి, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో మరో 10మంది జూని యర్ అసిస్టెంట్లు రెగ్యులర్‌గా పని చేస్తున్నారు.

పది, ఇంటర్ విద్యార్థులకు
షైనింగ్ స్టార్ అవార్డులు

- 177 మంది ఎంపిక : డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డు-2025 పేరుతో ప్రతిభా పురస్కారాలను ప్రభుత్వం అందజేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో 142 మందికి, ఇంటర్మీడియట్‌లో 35 మంది విద్యార్థులకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఇద్దరు విద్యార్థులు విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని, ఎంపిక ప్రక్రియ ప్రతి మండలం నుంచి ఓసీ-2, బీసీ-2, ఎస్సీ-1, ఎస్టీ-1 విద్యార్థులకు పూర్తిగా మెరిట్ ఆధారంగా లింగ వివక్ష లేకుండా పారదర్శకంగా ఎంపిక చేశామని తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌సీఈ, ఇంటర్ ఒకేషనల్ గ్రూపులకు చెందిన విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. పదో తరగతిలో 83.33 శాతం పైగా మార్కులు, ఇంటర్‌లో 830 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఈ పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. విభిన్న ప్రతిభావంతుల్లో 70 శాతం మార్కులు వచ్చిన వారిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

డ్రోన్లతో నిరంతర నిఘా

- నేరస్థులు సత్ప్రవర్తనతో ఉండాలి
- రాయలసీమ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

డోన్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు డ్రోన్లతో నిరంతర నిఘా ఉంచాలని రాయలసీమ రేంజ్ డీఐజీ డా.కోయ ప్రవీణ్ అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ముఖ్యఅతిథులకు డీఎస్పీ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డ్రోన్ పని తీరును డీఐజీ ప్రవీణ్ ఆపరేట్‌చేసి డెమో ద్వారా పోలీసులకు వివరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో పోలీసు సిబ్బంది కొరత ఉందన్నారు. 2018 తర్వాత పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ జర గలేదన్నారు. ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ ఆవరణంలో డ్రోన్‌ను అతిథులు ప్రారంభించి ఎగురవేశారు. అక్కడే పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ డిజిటల్ సైన్ బోర్డ్సును ప్రారంభించి డీఎస్పీ శ్రీనివాసులు డెమో ద్వారా ప్రదర్శించి ఉన్నతాధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ మోహన్‌రెడ్డి, డోన్ అర్బన్, రూరల్ బనగానపల్లె, బేతంచెర్ల పట్టణ, రూరల్, ప్యాపిలి సీఐలు ఇంతియాజ్ బాషా, సీఎం రాకేష్, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మంజునాథ్, వెంకట్రామిరెడ్డి, డోన్ అర్బన్, రూరల్ ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్, మమత తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్



డీఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఎమ్మెల్యే కోట్ల

తుంగభద్ర తీరం

సాహిత్యం





సెల్‌ఫోన్‌పై వ్యంగ్య పురాణం

కర్నూలు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): 'పుస్తకం హస్త భూషణం' అనేది ఒకనాటి మాట. కానీ నేడు 'చరవాణి హస్త భూషణం'గా మారిపోయింది. సెల్‌ఫోన్ అత్యవసరమే అయినా, అది చేస్తున్న మాయాజాలం అంతా ఇంతా కాదు. జానపద చిత్రం బాలనాగమ్మలో మాంత్రికుడు 'మాయా దర్పణం' వద్దకు వెళ్లి ప్రపంచంలోనే అందమైన సుందరిని చూపించమని కోరగా, ఆ దర్పణం బాలనాగమ్మను చూపిస్తుంది. అలా నేడు మాయాదర్పణం రూపంలో సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరి చేతిలోకి వచ్చింది. ఒకప్పుడు జోలపాటతో నిద్రించే చిన్నారి నేడు సెల్‌ఫోన్ చూస్తూ నిద్రించే పరిస్థితి ఏర్పడింది. చందమామను చూపిస్తూ గోరు ముద్దలు తినిపించే తల్లులు నేడు సెల్‌ఫోన్లు పిల్లల చేతికిచ్చి తినిపించే దుస్థితి నెలకొంది. పెద్దలు వాహనాలు నడుపుతూ కూడా సెల్‌ఫోన్లో మాట్లాడుతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మాయాజాలం నుంచి మేల్కొలిపేలా తేట తెలుగు పద్యాలతో విద్వాన్ పత్తి ఓబులయ్య 'సెల్లు (సెల్ ఫోన్) పురాణం' రాశారు. ఈ పుస్తకం అందరూ చదవాలి. పది మందితో చదివించాలి.

రచయిత పత్తి ఓబులయ్య

విస్మయ పరిచే హితోక్తులు... సంతోషాన్ని పంచే చతురోక్తులు

ఈ పుస్తకంలోని తేట తెలుగు పద్యాలు అన్ని వర్గాల వారికి అర్థమవుతాయి. 'నాడు వింతలు జగమందు ఏడు కలవు...నేడు ఎనిమిదో వింతయై వేడుకగనె...వసుధ సెల్లు వింత కథల పలికెదనిట...వినుడు సెల్లు పురాణము విశదముగను' అంటూ సెల్‌ఫోన్ పుట్టుక ప్రపంచంలోనే ఎనిమిదో వింతగా వర్ణిస్తూ పత్తి ఓబులయ్య సెల్లు పురాణం ప్రారంభిస్తారు. సెల్‌ఫోన్ రావడంతో రేడియో, కెమెరా, టార్చి వంటివన్నీ దూరమై పోయాయని, పోస్టు కార్డులు, వాచీలు, పుస్తకాలు, ఆటపాటలు, వీధి చావిట్లో ముచ్చట్లు దూరమై పోయాయని చెబుతారు. 'స్మార్టు ఫోను యుగము వచ్చె, చదువు సంధ్యసున్న, నీలి చిత్రాలను జూచి మురిసె...జగతి మాయ, జనము మాయ, చదువు మాయ రాత్రి, పగలు మాయ, వలపు మాయ' అంటూ ఒక పద్యంలో యువత సెల్‌ఫోన్ మాయా లోకంలో తేలియాడిన రీతిని చక్కగా వివరించారు. యువత స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా, ధనము, నీతి, బాధ్యతలు వదిలి అసాంఘిక అరాచక శక్తులుగా తయారై విలువైన జీవితాలను హత్యలతో, ఆత్మహత్యలతో, హింసలతో అంతం చేసుకుంటున్నారని రాశారు. ల్యాండ్‌ఫోను భార్యవంటిదని, వెంటవచ్చే సెల్‌ఫోన్ వేశ్య ప్రవృత్తి వంటిదని చతురోక్తితో వివరిస్తారు. అలాగే 'పెరిగె సైబరు నేరాలు, వేల డబ్బు... కొల్లగొట్టిరి సెల్ ఫోను కొట్టివేసి...అరనిమిషములో యావిరి యయ్యె డబ్బు...వినుడు సెల్లు పురాణము విశదముగను' అంటూ సెల్‌ఫోన్ల ద్వారా పెరిగిన సైబర్ నేరాలను వివరిస్తారు. మొత్తం 140 తేట తెలుగు పద్యాలతో కూడిన ఈ పుస్తకంలో ప్రతి పద్యం ఒక ఆణిముత్యం.

సమాజశ్రేయస్సును ఆకాంక్షించే 'సెల్లు పురాణం'...

కర్నూలుకు చెందిన విద్వాన్ పత్తి ఓబులయ్య వృత్తిరీత్యా ప్రిన్సిపాల్‌గా సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో పనిచేసి విశ్రాంత జీవితం కొనసాగిస్తున్నారు. ఆయన గతంలో తొమ్మిది పుస్తకాలు రాశారు. పదో పుస్తకంగా 'సెల్లు (సెల్‌ఫోన్) పురాణం' ఇటీవలే ఆవిష్కరించారు. నాటక రంగంలో విశేషానుభవం ఉన్న పత్తి ఓబులయ్య కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయన ప్రతిభను గుర్తించి కళారత్న (హంస పురస్కారం) అందజేసింది. సమాజంలో ఒక రుగ్మతలా తయారైన సెల్‌ఫోన్ల వాడకంలో మార్పు వస్తుందనే ఆశాభావంతో ఈ పుస్తకం రాశానని ఆయన ఈ పుస్తకంలో తెలిపారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య తన ముందుమాటలో ఇది నేడు అన్ని వర్గాల వారికి ఎంతో అవసరమైన పుస్తకం అన్నారు. అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో ఇది లభిస్తుంది.



కెంగార మోహన్
పుస్తక విశ్లేషకులు

కొత్తూరులో తెలంగాణ సంగీత అకాడమీ చైర్‌పర్సన్ పూజలు



చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు దేవస్థానంలో శనివారం తెలంగాణ రాష్ట్ర సంగీత అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య కుంజాల ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వా గతం పలికారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో శేషవస్త్రాలు, శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజే శారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కు టుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది సుబ్బా రెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు సురేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కళాసరయు..



చదువుతో పాటు కళల్లోనూ రాణిస్తూ అందరి చేత ఔరా అనిపించుకుంటోంది నంద్యాల పట్టణానికి చెందిన సరయు. ఈమె కూచిపూడిలో ప్రత్యేక ప్రతిభను చాటుతోంది. శాస్త్రీయ నృత్యం, ముఖాభినయనం, చిత్రలేఖనం వంటి వాటిలో అద్భుత ప్రతిభను కనబరుస్తూ చిన్న వయస్సులోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక సాంస్కృతిక ప్రదర్శనలిచ్చి అందరిచే ప్రశంసలందుకుంది. చిన్నతనం నుంచే నృత్యం, ఆటలు సాంస్కృతిక అంశాలను నేర్పిస్తే చిన్నారులు ప్రతిభావంతులుగా తయారువుతారనడానికి ఈ చిన్నారి సాధిస్తున్న విజయాలే తార్కాణం.

-నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)







విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నృత్యప్రదర్శన సందర్భంగా మంత్రి సత్యకుమార్‌చే అభినందన

- చదువుతో పాటు కళల్లో కూడా దిట్ట
- కూచిపూడిలో ప్రతిభ
- చిత్రలేఖనంలో ప్రావీణ్యం
- నేటి తరం బాలికలకు ఆదర్శం
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు
- అందరితో ప్రశంసలు

ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ..

నంద్యాల గురురాజా విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, సింధు దంపతుల కుమార్తె 'సరయు' 7వ తరగతి చదువుతోంది. ఆమెకు చదువుతో పాటు నృత్యం, చదరంగంపై ఆసక్తి ఉండేది. ఇది గుర్తించిన తల్లిదండ్రులు కుమార్తెను ప్రోత్సహించారు. చిన్నతనం నుంచే నృత్యం, ఆటలు సాంస్కృతిక అంశాలను నేర్పిస్తే చిన్నా రులు ప్రతిభావంతులుగా తయారువుతారని ఈచిన్నారి సాధిస్తున్న విజయాలే తార్కాణం. తల్లిదండ్రులు ప్రోత్సాహం కూడా తోడైతే ఉన్నతిస్థితికి చేరుతారు అనడానికి ఈచిన్నారి సరయు బహుమ తులే నిదర్శనం. చిన్నారి సరయు ఐదేళ్ల వయస్సు నుంచి పాఠశాల మాస్టర్ల వద్దనే కూచిపూడిలో ప్రత్యేక శిక్షణ తీసుకుం టుంది. సాయంత్రం వేళలో ప్రణాళికాబద్ధంగా మెలకువలు నేర్చుకుంటూ ఒక వైపు ఆధునిక నృత్యం, జానపద నృత్య ప్రదర్శనలో రాణిస్తూ.. మరోవైపు ముఖాభినయనం, చిత్రలేఖనంతో పాటు చదువులోనూ అనేక రకాల టాలెంట్ టెస్ట్‌ల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అన్నింటిలోనూ అత్యుత్తమ ప్రతిభా పురస్కా రం అందుకోవడం ఆల్ రౌండర్ ప్రతిభకు నిదర్శనం. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటోంది.





రాష్ట్రస్థాయిలో సర్‌సివి రామన్ యంగ్‌జీనియస్ గోల్డ్‌మెడల్ అందుకుంటున్న "సరయు"



మంత్రి ఫరూక్‌చే మెమెంటో అందుకుంటూ..



రవీంద్రభారతిలో గోల్డ్ మెడల్ అందుకుంటున్న "సరయు"

'సరయు' సాధించిన బహుమతులు

- 2018లో కర్నూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రథమ స్థానం.
- 2019 గుంటూరులో నిర్వహించిన ప్రపంచ తెలుగు బాలల పండుగ జాతీయస్థాయి బాలోత్సవంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు బహుమతి సాధించింది. నంద్యాల కళారాధన సంస్థ వారు సరయు ప్రతిభలకు నిదర్శనంగా బాలరత్న పురస్కారం ప్రదానం చేశారు.
- 2020లో మైల్‌స్టోన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ లో ప్రత్యేక బహుమతి.
- 2021లో హైదరాబాద్‌లో సుచిర్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన సీవీ రామన్ సైన్స్‌ఒలంపియాడ్‌లో మూడు సార్లు గోల్డ్‌మెడల్ సాధించి రవీంద్ర భారతిలో బహుమతి అందుకుంది.
- 2022లో జాతీయ స్థాయి బాలోత్సవంలో ప్రతి సంవత్సరం కథ చెప్పడం వక్తృత్వం, ముఖాభినయనం పోటీల్లో ప్రథమ, ప్రత్యేక బహుమతులు సాధించారు.
- 2023లో కళారాధన సంస్థ నిర్వహించిన ఏకపాత్రాభినయనం పోటీల్లో ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణతో ప్రథమ బహుమతి సాధించినది. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో భగత్ సింగ్ వేషధారణలో ప్రథమ బహుమతిని సాధించింది.
- 2024లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శనలో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో బహుమతిని అందుకున్నారు.
- 2024లో నంద్యాల నంది బాలోత్సవంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్యప్రదర్శనలో ప్రథమ బహుమతి దక్కింది.
- 2024లో సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినది.
- 2024లో ఏపీ టూరిజం వారు నిర్వహించిన జిల్లాస్థాయి ఫిల్మ్ డాక్యుమెంటరీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి కలెక్టర్‌తో అందుకుంది.
- 2025లోజాతీయ సైన్స్ దినోత్సావాన్ని పురస్కరించుకొని సైన్స్ ఎక్స్‌పోలో ప్రథమ బహుమతి కైవసం.

జీడీపీ నుంచి నీరు విడుదల

- ఖరీఫ్‌లో సాగు నీరు విడుదల చేయాలంటున్న రైతులు
- తాగునీరు పథకాలకు ఇబ్బంది వస్తే ఎలా?
- జీడీపీలో కేవలం ఉన్నది 1.1 టీఎంసీలే
- లీకేజీ నీరు అంటున్న అధికారులు

గోనెగండ్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఎడవ కాలువ ద్వారా శనివారం నీరు విడుదల చేశారు. జీడీపీ కింద సాగునీరు కేవలం రబీ సీజన్‌లో మాత్రమే విడుదల చేయాల్సి ఉంది. అయితే ఖరీఫ్ సీజన్‌లో నీటి విడుదల ఏమిటని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. జీడీపీ ఎడవ కాలువ వెంట ఉన్న పంట భూములకు సాగునీరు కోసం నీటిని విడుదల చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీటితో ఈ ఏడాది వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరే వరకు తాగునీటి పథకాలకు నీరు సర్దాల్సిఉంది. అయితే ఉన్న నీటిని ఖరీఫ్ సీజన్‌లో పొలాలకు విడుదల చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే నీటి విడుదల జీడీపీ అధికారులకు తెలిసి జరిగిందా లేక కొంతమంది రాజకీయ బలంతో అధికారులకు చెప్పకుండా నీటిని విడుదల చేసుకున్నారా? అన్నది స్పష్టత లేదు. జీడీపీ అధికారులకు తెలిసే నీటి విడుదల జరిగినట్లు మరి కొంతమంది తెలుపుతున్నారు.

నీరు నీరు లీకేజీ అవుతోంది

గాజులదిన్నె ప్రాజెక్టు ఎడవ కాలువ వెంట వెలుతున్న నీరు లీకేజీ నీరు మాత్రమే అంతే కాని జీడీపీ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయలేదు. లీకేజీ అవుతున్న నీటికి కూడా అడ్డుకట్ట వేస్తాము. తాగునీటి పథకాలకు నీటి సమస్యను రాకుండా చూస్తాము.

- విజయ్‌కుమార్, డీఈ, జీడీపీ



ఎడవ కాలువ ద్వారా నీరు పారుతున్న దృశ్యం

నిర్లక్ష్యం మానైంది



నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కర్నూలు కలెక్టరేట్ భవన సముదాయాలు నిలుస్తాయి. ఈ ప్రాంగణంలోనే కలెక్టర్ వసతి గృహం కూడా ఉంది. కలెక్టరేట్ భవన సముదాయంలో అన్నిప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలు కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగు తాయి. శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయం పక్కన ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం (ఏపీడబ్ల్యూఐపీ) కార్యాలయం వెనుక భాగం గోడపైన రాగిచెట్టు పెరిగి మాను అవుతోంది. ఈచెట్టు ఇలాగే పెరిగితే.. భవనం ప్రమాదస్థాయికి చేరుకుంటుంది. ఈభవనంపై పెరుగు తున్న చెట్టు అధికారుల కన్నులకు కనిపించలేదా.. లేక భవనంపై పెరిగితే ఏమీ కాదులే అనుకున్నారేమో తెలియదు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో చిత్తశుద్ధి లోపించిందనడానికి ఇదే ఒక నిదర్శనం.

- కర్నూలు ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి)

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ అశోక్ ఎస్ కినగి కుటుంబ సమేతంగా శనివారం మంత్రాలయం వచ్చారు. ఈయనకు మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం మఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజ ఆచార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి పాల్గొన్నారు.



శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ అశోక్ ఎస్ కినగి

సోయగమనం

- నల్లమలలో అల్లుకుపోయిన పచ్చదనం
- ప్రయాణికుల్ని కనువిందు చేస్తున్న వన్యప్రాణులు
- అటవీ ప్రాంతం మీదుగా ఆహ్లాదకర ప్రయాణం

ఆత్మకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నల్లమల అందాలు మైమరిపిస్తున్నాయి. జీవ వైవిధ్యానికి మారుపేరైన నల్లమల అడవులు ప్రకృతి రమణీయతను సంతరించుకున్నాయి. ఈఏడాది మే నెలలో కురిసిన వర్షాలతో అడవంతా పచ్చదనంతో కళకళలాడుతోంది. ప్రత్యేకించి కర్నూలు-గుంటూరు(కేజీ) జాతీయ రహదారికి ఇరువైపుల విస్తరించిన నల్లమల అడవి ఆహ్లాదాన్ని పంచుతోంది. ఆరోడ్డుకు ఇరువైపుల వున్న వృక్షాలు రహదారిని కమ్మేసేలా దర్శనమిస్తూ పచ్చదనంతో స్వాగతం పలికేలా ఆకర్షణగా నిలిచాయి. దీంతో కేజీ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు మార్గమధ్యంలో నిలిచి నల్లమల అందాల ఆస్వాదిస్తూ.. ఆనందిస్తున్నారు. అనేక రకాల గడ్డి జాతులతో పచ్చికబయళ్ల వ్యాపించడంతో ఆప్రదేశాల్లో జింకలు, ఇతర వన్య ప్రాణులు ప్రయాణికుల్ని మధురానుభూతిని కలిగిస్తున్నాయి.



కనువిందు చేస్తున్న జింకలు





పచ్చదనాన్ని సంతరించుకున్న కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి

మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి

బైర్లూటి నుంచి దోర్నాల సమీపంలోని కొర్రప్రోలు వరకు కేజీ రహదారి ఇలాగే పచ్చదనాన్ని సంతరించుకోవడంతో ఆమార్గం గుండా వెళ్లే ప్రయాణికుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో పశుపక్షాదుల శబ్దాలు నల్లమల ప్రయాణంలో చెరిగిపోని జ్ఞాపకాలను నింపుతున్నాయి. దారిపొడవునా వివిధ రకాల సీతాకోకచిలుకలు కనువిందు చేస్తున్నాయి. శ్రీశైలం రేంజ్ పరిధిలోని శ్రీశైలం-దోర్నాల రహదారి కూడా పర్యావరణ ప్రేమికుల్ని ఆకట్టుకుంటుంది. రోడ్డుకు ఇరువైపుల పచ్చదనం ఉండటంతో శ్రీశైలం వెళ్లే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇదిలా వుంటే ఆత్మకూరు నుంచి వెలుగోడుకు వెళ్లే రహదారి కూడా అడవంతా పచ్చదనంతో అల్లుకుపోయింది. దీంతో ఆమార్గంలో వెళ్లే ప్రయాణం కూడా ఆహ్లాదకరంగా మారింది.,

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- వైఎస్ఆర్ స్మృతివనం సమీపంలో ఘటన



సనావుల్లా, సమీర్ (ఫైల్)

ఆత్మకూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరు నంద్యాల రహదారిలోని వైఎస్ఆర్ స్మృతివనం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సనావుల్లా (20), సమీర్ (20) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. షేక్షావలి అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జరిగింది. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వెలుగోడు పట్టణానికి చెందిన సమీర్, సనావుల్లా, షేక్షావలి కేక్ కోసం ఓ బైక్‌పై శనివారం సాయంత్రం ఆత్మకూరుకు బయలు దేరారు. మార్గమధ్యంలో వైఎస్ఆర్ స్మృతివనం సమీపంలో గుర్తు తెలియని వాహనం ప్రమాదవశాత్తు వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో సనావుల్లా, సమీర్‌లు అక్కడికక్కడే మృతి చెందగా షేక్షావలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో క్షతగాత్రులను వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మకూరు సీఐ రాము, ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని తీవ్రగాయాల పాలైన షేక్షావలిని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుమారులు మృతితో ఆసుపత్రిలో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కలిచి వేశాయి. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ రాము వెల్లడించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి...

ఆదోని, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని- కోసిగి రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని బసన్న(56) మృతి చెందాడు. రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వర రావు తెలిపిన వివరాలు మేరకు శుక్రవారం రాత్రి 10 సమయంలో కోసిగి ఎల్‌సీ గేటు 205 వద్ద 523/33-35 కేమీ దగ్గర అప్‌లైన్ ట్రాక్‌లో జంపాపురం బసన్న దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. బసన్నకు చెవులు సరిగా వినపడనందున ఈ ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నీటి కుంటలో పడి బాలిక..



రోధిస్తున్న తల్లి, బంధువులు, ఇన్‌సెట్‌లో రూప(ఫైల్)

చిప్పగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మరో ఐదు రోజులలో పాఠశాలలు తెరిచాక బడికి వెళ్లాల్సిన బాలిక నీటి కుంటలోపడి మృతి చెందింది. చిప్పగిరి మండలం, దౌల్తాపురం గ్రామంలో రూప(10) అనే బాలిక శనివారం ఉదయం పొట్టేలును మేపడానికి పొలాల్లోకి వెళ్లింది. అక్కడున్న నీటి కుంటలో ప్రమాదవశాత్తుపడి మృతి చెందింది. బాలిక తండ్రి బాలు ఆటో డ్రైవర్, తల్లి శకుంతల వ్యవసాయ కూలీ. వీరికి ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురు రూప 5వ తరగతి పూర్తి చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమైతే ఆరో తరగతిలో చేర్చాల్సి ఉంది. బాలిక మృతి గ్రామంలో విషాదం నింపింది.

అరుగుపై నుంచి పడి వ్యక్తి..

బేతంచెర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కురువ వెంకటేశ్వర్లు (30) అనే వ్యక్తి గురువయ్య పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న స్వామి కాంప్లెక్స్ వద్దనున్న అరుగుపై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నివాసముంటున్న కురువ వెంకటేశ్వర్లు స్వామి కాంప్లెక్స్ అరుగు మీద పడుకుని ఉండగా.. ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు బలమైన గాయం కావడంతో చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం బేతంచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అందించేలోపే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య లావణ్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆళ్లగడ్డ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న లక్ష్మి డీటీహెచ్ సర్వీస్ సెంటర్‌లో శనివారం పోలీసులు గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రుద్రవరం మండలం నల్లవాగు పల్లె గ్రామానికి చెందిన రామలింగేశ్వరరెడ్డికి చెందిన డీటీహెచ్ సర్వీస్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాకెట్‌లో సూమారు కేజీ గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. షాపు యజమాని రామలింగేశ్వరరెడ్డిని అదపులోకి తీసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.



పోలీసులు స్వాదీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్

రెండు రాష్ట్రాలకూ గుండ్రేవుల అవసరం

- తెలంగాణ డిప్యూటీ సీఎంకు టోల్ ప్లాజా వద్ద స్వాగతం
- వినతులతో కలిసిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు

కర్నూలు, అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నీటి సమస్య పరిష్కారానికి గుండ్రేవుల ప్రాజెక్టు అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్కకు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం కర్నూలు నగర శివారులోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఉమ్మడి జిల్లాల నాయకులు ఘన స్వాగతం పలికారు. నంద్యాల డీసీసీ జె. లక్ష్మీన రసింహ, కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాది గ కలిశారు. నంద్యాల జిల్లా పిన్నాపురం సోలార్ పవర్ ప్లాంట్ పరిశీలన కోసం వెళ్తున్న తెలంగాణ డిప్యూటీ సీఎంను కలిసి వినతి పత్రం ఇచ్చారు. గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే రెండు రాష్ట్రాల సాగు, తాగు నీటి కష్టాలు తీరుతాయని అన్నారు. దీని కోసం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు దామోదరం రాధాకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రజాక్ వలీ, హైమావతి, లాజరస్ పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పంట వ్యర్థాలతో భూసారం

- వరి కొయ్యలను కాల్చేస్తే నేలకు నష్టం
- ప్రమాదకరస్థాయిలో పడిపోయిన సేంద్రియ కర్బనం
- పొలాన్ని కలియదున్నితే పంటలకు మేలంటున్న శాస్త్రవేత్తలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అసలే మన జిల్లాల్లోని నేలలో సేంద్రియ కర్బనశాతం తక్కువ. నేలలో సహజంగా కోట్ల సంఖ్యలో సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా, శిలీంద్రాలతో పాటు వేల సంఖ్యలో కీటకాలు, వానపాములు, నులిపురుగులు ఉంటాయి. ఇవన్నీ సేంద్రియ పదార్థాలు కుళ్లేలా చేసి మొక్కలకు పోషకాలను అందించి భూసారాన్ని కాపాడుతాయి. పంట వ్యర్థాలను రైతులు కాల్చివేస్తే నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు, మిత్రపురుగులకు తీవ్ర నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పైగా పంట వ్యర్థాలను తగులబెట్టేటప్పుడు వెలువడే పొగ వల్ల తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతుంది. ఈ కారణం వల్ల కూడా పంట వ్యర్థాలను విచక్షణా రహితంగా కాల్చివేయకూడదు.



వరి కొయ్యలను కాలుస్తున్న రైతు

సాగు విధానంలో మార్పులు శాస్త్రీయంగా ఉండాలి. గతంలో వరి పంటను కొడవళ్లలో మొదళ్ల దాకా కోసేవారు. అయితే ప్రస్తుతం మిషన్‌తో వరిపంటను అడుగు మేర కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. దీంతో దున్నే సమయంలో రైతులు నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని వరికొయ్యలను తగులబెడుతున్నారు. దీ ని వల్ల భూసారానికి నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది

వరి కొయ్యలను కాల్చితే రైతులకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. విపరీతమైన వేడితో నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. పంటలకు అవసరమైన ఖనిజ, లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, తొండల్లాంటి అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.



పొలాన్ని కలియ దున్నితే కలిగే లాభాలు



- వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10శాతం వరకు అధికంగా వచ్చే అవకాశముంది.
- దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్‌ఫాస్పేట్ చల్లితే వరి కొయ్యల అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.
- సూపర్ ఫాస్పేట్ చల్లితే భూమి చౌడుబారడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుతుంది.
- కలియ దున్నడం వల్ల ఎకరాకు టన్ను వరకు ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని(యూరియా), నాలుగు శాతం ఫాస్పరస్ అదనంగా అందిస్తుంది. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తుంది.

తగ్గిపోయిన సేంద్రియ కర్బనశాతం

ఉమ్మడి జిల్లాల్లో సేంద్రియ కర్బనశాతం చూస్తే దిగ్భ్రాంతికరంగా ఉంది. అధికంగా ఉష్ణోగ్రతలుండే మన భూముల్లో సేంద్రియ పదార్థం త్వరగా అంతరించిపోతుంది. సాధారణంగా 0.08శాతం నుంచి 0.75శాతం ఉండాల్సిన సేంద్రియ కర్బనశాతం మన నేలల్లో 70శాతం భూముల్లో 0.05శాతం కంటే తక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. రసాయన ఎరువులను అధికంగా వాడడం, పొలాల్లో వ్యర్థాలను కాల్చడం వంటి చర్యలతో మరింత కర్బనశాతం పడిపోయి పంట దిగుబడి తగ్గిపోతుంది. మట్టిలో పశువుల ఎరువు, పచ్చిరొట్టి ఎరువులు, పంట మిగులు వంటివి విరివిగా వాడడం వల్ల మట్టిలో సేంద్రియ కర్బనశాతం పెంచవచ్చు.

నేల భౌతిక లక్షణాలు దెబ్బతింటాయి



రైతులు అధికంగా రసాయనాలు వాడడం, పంట వ్యర్థాలను కాలిస్తే పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోవడం వల్ల నేల భౌతిక లక్షణాలు దెబ్బతింటాయి. కేంద్ర కర్బనశాతం ఆవిరైపోయి సూక్ష్మజీవులు నశించి దిగుబడులు కూడా తగ్గిపోతాయి. ఒక ఎకరాలో వరికొయ్యలను భూమిలో కలియదున్నడం వల్ల రెండు ట్రాక్టర్‌ల ఎరువు లభిస్తుంది.

● కేవీ రమణయ్య, భూసార శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం

దిగుబడి తగ్గిపోతుంది



వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగుల కోల్పోవడం వల్ల పంట దిగుబడి తగ్గిపోతుంది. వరి కొయ్యలు పొలంలో కలియదున్నాలని రైతులకు వ్యవసాయ సదస్సుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

● మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

గ్రీన్‌కో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు అద్భుతం

- తెలంగాణలో కూడా ఏర్పాటు చేస్తాం
- ప్రాజెక్టును సందర్శించేందుకే వచ్చా
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఓర్వకల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి ప్రతిష్టాత్మక గ్రీన్-కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు ఒక అద్భుతమని తెలంగాణ రాష్ట్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని గుమితం తండా సమీపాన ఉన్న సోలార్ పార్కు గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును టీఎస్ డిప్యూటీ సీఎంతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సందర్శించారు. అంతకుముందు తెలంగాణ డిప్యూటీ సీఎంకు గ్రీన్‌కో ఎండీ చలమలశెట్టి అనిల్ కుమార్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గ్రీన్ కో అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అప్పర్ ఇన్‌టెక్ పాయింట్ సోలార్ పార్కు గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు విండ్ పవర్ ప్రాజెక్టులను రిజర్వాయరు నుంచి నీటిని పైపులైన్ ద్వారా టర్బైల వరకు సరఫరా చేసే విధానాన్ని వారు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో టీఎస్ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు ప్రపంచంలో మొట్టమొదటిదన్నారు. ఇలాంటి ప్రాజెక్టు మన దేశంలో ఉండటం గర్వకారణ మన్నారు. తెలంగాణలో కూడా ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం తరపున దీన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా వచ్చానన్నారు. గ్రీన్ కో సంస్థ అనుకున్న సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసి కరెంటు ఉత్పత్తి చేస్తుందన్నారు. సోలార్ ద్వారా 4వేల మెగా వాట్ల విద్యుత్, విండ్ హైడ్రా ద్వారా 2వేల గ్రీన్ ఎనర్జీ ఇక్కడి నుంచి ఉత్పత్తి చేస్తున్నదని అన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివా సులు, గ్రీన్ కోఅసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసనాయుడు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నంద్యాల టౌన్, జూన్7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద శుక్రవారం అర్ధరాత్రి మద్దిలేటి అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. పాణ్యం మండలం అనపూరు గ్రామానికి చెందిన మద్దిలేటి తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రైల్వే సిబ్బంది 108లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆయనకు రెండు కాళ్లు, ఒక చెయ్యి తెగిపోయాయని రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. మద్దిలేటికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఎవరి కోసం?

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.81 వేల కోట్లతో ప్రకటించిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఎవరి కోసం నిర్మిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం కేకే భవన్‌లో జిల్లా కార్యదర్శి జి. రామక్రిష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సాగునీటి అవసరాలను తీర్చాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రాజెక్టులకు కలిపి సుమారు రూ.13.844 కోట్లు అవుతుందన్నారు. వీటి నిర్మాణం పూర్తి అయితే కొత్తగా సాగునీరు అందించే ఆయకట్టు 13,80,529 ఎకరాలు అన్నారు. వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించకుండా రూ.81 వేల కోట్లతో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కాంట్రాక్టర్ల నుంచి వచ్చే కమీషన్ల కోసం రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చవద్దని అన్నారు.

మూడు నిమిషాలు ఆగిన వందేభారత్

కోసిగి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు నుంచి గుల్బర్గా వెళ్తున్న 22232 నెంబరు గల వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కోసిగి రైల్వే స్టేషన్‌లో మూడు నిమిషాల పాటు ఆగింది. శనివారం కురిసిన వర్షానికి సిగ్నల్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. సిగ్నల్ సమస్య రావడంతో వందేభారత్ లోకోపైలట్ కోసిగి స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడి రైలును మూడు నిమిషాలు నిలిపారు. సమస్య పరిష్కారం కావడం రైలు గుల్బర్గా వైపునకు కదిలిందని స్టేషన్ కౌశల్‌కుమార్ తెలిపారు.

లాడ్జీల ధరలకు రెక్కలు

- భక్తుల నుంచి నిలువు దోపిడీ
- రూ.300 రూం రూ.15వేలు
- భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని డిమాండ్
- బలవంతంగా వసూలు
- పట్టించుకోని అధికారులు



మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్

మంత్రాలయం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ప్రైవేటు లాడ్జీల ధరలకు రెక్కలు వస్తున్నాయి. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ప్రైవేటు లాడ్జీల యజమా నులు నిలువుదోపిడీకి గురిచేస్తున్నారు. రూ.300లు గల అద్దె ఉన్న గదిని ఏకంగా రూ.15వేలు పెంచి భక్తుల నుంచి ముక్కు పిండి వసూలు చేశారు. బక్రీద్, ఆదివారం వరుస సెలవు దినాలు రావడంతో శుక్రవారం నుంచి శనివారం రాత్రి వరకు భక్తుల రద్దీని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు లాడ్జీల యజమా నులు అమాంతంగా గదులకు రేట్లను పెంచేశారు. గంటకు ఓ రేటు పెట్టి భక్తులను దోచుకుం టున్నారు. ఇంత పెద్ద మొత్తం లో చెల్లించలేని సాధారణ పేద, మధ్యతరగతి భక్తులు పిల్లాపా పలతో, తల్లిదండ్రులు, వృద్దులతో మధ్వమార్గ్ కారిడార్‌లోనే బస చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇళ్లను సైతం లాడ్జీలుగా మార్చేసి..

కొంత మంది ఇళ్లను సైతం లాడ్జీలుగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్న ఇంట్లోనే స్నానానికి రూ.250 నుంచి రూ.300 ప్రకారం ఇవ్వడంతో మంత్రాలయంలోని పలు ఇళ్లు మూడు పూవులు, ఆరు కాయలుగా భక్తులను ఆహ్వానించి డబ్బు సంపాదిస్తున్నారు. అందనంత రేట్లు పెట్టడంతో పిల్లాపాపలతో టభక్తులు ఇబ్బందులు పడ్డారు. మంత్రాలయంలో దాదాపు 10వేల నుంచి 15వేల దాకా వసతి కల్పించేందుకు అనుకూలంగా ఉంది. 60వేల నుంచి 80వేల మంది పైగా భక్తులు తరలివచ్చారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు లాడ్జీల యజమానులు రేట్లను అమాంతంగా పెంచేసి కృత్రిమ కొరత సృష్టించారు. ప్రైవేటు లాడ్జీల యజమానులు మిలాఖత్ అయ్యారు. మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన దాదాపు 1500 రూములు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని నిండిపోవడంతో కర్ణాటక గెస్టుహౌస్, అబోడే హోటల్, శ్రీనికేతన్ నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లాడ్జీల్లో 3 గంటలకు ఒక రేటు పెట్టి, ఆ స్నానానికి, కాలకృత్యాలకు ఓ రేటు పెట్టి నిమిషం దాటినా రూ.వేలలో వసూలు చేయడం దారుణంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడం తోనే ప్రైవేటు లాడ్జీల యజమానులు భక్తులను దోచేసుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, కుడా అధికారులు చర్యలు తీసుకుని లాడ్జీల ధరలకు కల్లెం వేసేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

టైం బాగోలేదట..!

కర్నూలు క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొందరి పోలీసుల్లో మూఢ నమ్మకాలు పెరిగిపోతున్నాయి. రాహు కాలం.. వర్జ్యం.. దుర్ముహూర్తం అంటూ కేసుల నమోదుకు శుభగడియల కోసం వేచి చూస్తున్నారు. శుభగడియల్లో కేసులు నమోదు చేస్తే బాగా రికవరీ అవుతాయని నమ్ముతున్నారంటే పోలీసుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏదైనా సమస్యపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా.. ఫోన్లు చేసినా నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. కేసులు నమోదు చేసేందుకు సవాలక్ష సాకులు చెబుతున్న పోలీసుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ఎస్ఐలు లేరని, సీఐ లేరని.. బందోబస్తు వెళ్లారని.. వారు వచ్చిన తర్వాత చూస్తాంలే అంటున్నారు. ఈ తీరుతో స్టేషన్‌కు వచ్చే బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పోలీస్‌స్టేషన్లలో వింత పోకడ
- రాహుకాలం.. వర్జ్యం.. దుర్ముహూర్తం అంటూ అలసత్వం
- కేసుల నమోదు సవాలక్ష సాకులు





సొత్తుకు పొంతన ఉండదు

పోయిన సొత్తుకు.. కేసులో నమోదు చేసిన సొత్తుకు.. రికవరీ చేసిన సొత్తుకు పొంతనే ఉండదు. 10తులాలు పోతే ఏ మూడో, నాలుగో తులాలు పోయినట్లుగా ఫిర్యాదు రాయించుకుంటారు. ఇక నగదు పోతే.. దొంగల దగ్గర ఇంక ఎక్కడి నగదు ఉంటుంది.. అంతా ఖర్చు అయిపోయి ఉంటుంది.. దానికి మేమేం చేస్తాం.. పోయిన బంగారు ఎంతో రాసివ్వండంటూ దబాయిస్తున్నారు.. ఆర్టీసీ బస్టాండులో, బస్సులో చోరీ జరిగితే.. బాధితులతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉంటుంది. మెడలో గొలుసు పోయిందని... పర్సు కొట్టేశారని, పిక్‌ప్యాకెట్ చేశారనని చెబితే.. పోలీసుల కోపం నషాళానికి అంటుతుంది. కేసు నమోదు చేయాలంటే.. బాధితుల నుంచి కన్నీళ్లు రావాల్సిందే. ఇళ్లల్లో చోరీ జరిగితే పోలీసులకు వచ్చే కోపం అంతా ఇంతా కాదు. సీసీ కెమెరాలు లేవని, పోలీస్‌స్టేషన్‌లో చెప్పాలి కదా అంటూ వారి వెటకారం తీరుతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

అలసత్వమే కారణం..

కేసు నమోదు చేయకపోవడానికి కారణం అలసత్వమే.. కేసు నమోదు చేస్తే అనవసరంగా దర్యాప్తుకు ఖర్చు పెట్టాలి. రికవరి చేయాలి.. ఈ ఖర్చు అంతా ఎవరిస్తారనేది పోలీసుల వాదన. మరో వైపు పెండింగ్ కేసులు ఎక్కువైతే.. పై అధికారుల నుంచి చీవాట్లు. ఎలాగోలా రికవరీ చేయాలంటే అంతా చేతినుంచి వేసుకోవాలి. అన్ని తిప్పలు ఎందుకంటూ కేసులు నమోదు చేయకపోతే సరిపోతుంది కదా అంటూ పోలీసులు వ్యవహరిస్తున్నారు.

ఉన్నతాధికారులకు సైతం..

కేసుల నమోదులో ఎస్‌హెచ్‌వోలు వ్యవహరిస్తున్న తీరు ఉన్నతాధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. జిల్లా పై పోలీసు అధికారులను సైతం ఏమారుస్తున్నారనే విమర్శలున్నాయి. చాలా కేసులు నమోదు చేయకుండా ఉండేలా చూస్తారు. మరుసటి రోజు పత్రికలో సమాచారం వస్తే పోలీసు బాసులు ఆ సంఘటనపై ఆరాతీస్తే తప్ప కేసు నమోదు చేయరు. ప్రతి స్టేషన్‌లో ఎస్‌బీ సిబ్బందిని సైతం ఏమారుస్తూ వారికి వివరాలు చెప్పకుండా ఏ అర్ధరాత్రో.. ఏ అపరాత్రో కేసులు నమోదు చేస్తారు. శని, ఆదివారాల్లోనే ఎక్కువ కేసులు నమోదు చేస్తారు. దీనికి కారణం ఆ రెండు రోజుల్లో సెట్ కాన్ఫరెన్స్ ఉండదు... జిల్లా బాసు నుంచి చీవాట్లు ఉండవు.. ఎవరికి వివరణ ఇచ్చుకోవాల్సి ఉండదు అని భావించి ఇలా చేస్తున్నారు.





ఇటీవల సంఘటనలు

- కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పలు బైకులు రికవరీ చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌లను పరిశీలిస్తే.. సుమారు 13 బైకులు వరుసగా ఒకరోజు తర్వాత మరుసటి రోజు పోయినట్లుగా ఉన్నాయి. ఇవన్నీ గతంలో చోరీ జరిగినవే. అప్పట్లో బాధితుల నుంచి వివరాలు మాత్రం తీసుకుని పంపించేశారు. రికవరీ అయ్యాకే అప్పటికప్పుడు కేసులు నమోదు చేశారు.
- నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దినసరి కూలీ ఇంట్లో 2 తులాల బంగారు నగలు చోరీ అయ్యాయి. బాధితుడు సుమారు 15 రోజుల పాటు స్టేషన్ చుట్టూ తిరిగినా పోలీసులు మాత్రం కనికరించలేదు. ఇప్పటి వరకు కూడా కేసు నమోదు చేసుకోలేదు.
- నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన పెళ్లిలో బంగారం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ విషయం పత్రికల్లో వచ్చింది. బాధితుడిపై పోలీసులు వేసిన చిందులు అంతా ఇంతా కాదు. ఓ వారం రోజుల పాటు స్టేషన్ చుట్టూ తిప్పించుకుని మరీ కేసు నమోదు చేశారు.
- నగరంలోని ఓ బైక్ రైడర్ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశాడు. డ్రైవర్ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరాడు. పోలీసులు ఆరోజు కేసు నమోదు చేయలేదు. ఆ వార్త పత్రికల్లో వచ్చింది. డీఎస్పీ సీఐకి చీవాట్లు పెట్టారు. దీంతో అప్పటికప్పుడు కేసు నమోదు చేసి బైక్ రైడర్‌ను అరెస్టు చేశారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో నారాయణ ప్రతిభ


నారాయణ కళాశాల విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డీజీఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో ఎం.సహారా 436, జి.సరియూ 436 మార్కులు, షేక్ బొంతల సనా 436, ఎరమ్ రక్షాన్ 436, షేక్ నసీఫా 436, పోతినేని యషిక 436 మార్కులు సాధించారన్నారు. అలాగే జూనియర్ ఎంపీసీ విభాగంలో వి.హర్షిత 467, ఎండీ హఫీజ్ తౌసిఫ్ 467, సుగంధిని రెడ్డి 467, ఎస్.శివచక్రధర్ 467 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ్మ మార్కులు సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థ డీజీఎం గోవర్ధన్ రెడ్డి, డీన్స్, ప్రిన్సిపాల్స్ అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థులు...

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో కర్నూలు శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయదుందుబి మోగించారని శ్రీచైతన్య కళాశాల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో బి.యశస్విని 467 మార్కులతో పాటు కే.హర్షిత 466, జి.అభిలాష్ 466, ఏ.మరియమ్మ 466, ఎం.ముజాహీద్ 466, ఎం.నస్రీమ్ బేగం 466, ఎం. లిఖిత 466, లావణ్య 466, దేవవర్షినిరెడ్డి 466, గౌరిప్రశాంత్ 466 మార్కులు సాధించారని తెలిపారు. ప్రతి ముగ్గురిలో ఒక్కరికి 420 మార్కులు పైగానే సాధించారని తెలిపారు. అలాగే జూనియర్ బైపీసీ విభాగంలో బి. జ్వలిత 436, ఎస్.సదాఫ్ 436, కే.భావన 436, డి.పల్లవి 435, ఎం.సనా ఫాతిమా 435, పీహెచ్ దీప్తిరెడ్డి 435, కె.చరిత 435, డి.షమీనా 435, జి.వర్శిని 435, ఆర్.ఖాతూన్ 435, కే.స్నేహిత 435, సువాంశిక 435, కే.శిరీష 435, ఎస్.అత్‌ఖియా తహరీమ్ 435 మార్కులు సాధించారనీ ఆయన తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సహకరించిన తల్లిదండ్రులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఏజీఎం మురళీకృష్ణ అభినందించారు.

బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి రూ.25 వేలు విరాళం


నగదు విరాళం అందజేస్తున్న దాత ఉమామహేశ్వర్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పెద్దపాడు రోడ్డులోని ఏపీ ఆదర్శ పాఠశాల పక్కన నిర్మాణంలో ఉన్న బీరప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి కర్నూలు చెందిన కల్లూరుకు చెందిన కే.ఉమామహేశ్వర్ రూ.25వేల నగదును శనివారం కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, సహాయ కార్యదర్శి బీసీ తిరుపాల్‌కు విరాళాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం కమ్యూనిటీ హాలు విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

కర్నూలు న్యూసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో చేస్తున్న సమ్మె శనివారం నాలుగో రోజుకి చేరింది. జిల్లా అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సమీర్‌బాషా, ఉపాధ్యక్షుడు నాగశేషులు, కార్యదర్శి యాసిన్‌బేగ్, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య పతాక ఆవిష్కరణ


బ్రాహ్మణ సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సమాఖ్య నాయకులు

కర్నూలు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) ఆవిర్భవించి 42 ఏళ్లు అవుతున్న సందర్భంగా నగరంలోని దేవనగర్‌లో గల సమాఖ్య కార్యాలయంలో ఏపీబీఎస్ఎస్ఎస్ పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్ రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సమాఖ్య రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కళ్లే చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో సమాఖ్య యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సుందరరామశర్మ, ప్రచార విభాగం కార్యదర్శి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు ఎస్ దుర్గాప్రసాద్, బాల సత్యనారాయణ, దుర్గాప్రసాద్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లెలో దళిత మహిళను ఆరునెలల నుంచి అత్యాచారానికి పాల్పడిన 14 మంది నిందితులను అరెస్టు చేయాలని ఐద్వా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే. అరుణ, ఎస్. అలివేలు, రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావతృతం కాకుండా ప్రభుత్వం మహిళలకు గట్టి భద్రత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి


డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం డీఈవో శామ్యూల్ పాల్‌ను కలిసి ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ఎస్‌జీటీలకు బదిలీలకు మాన్యువల్ విధానంలో కాకుండా వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. కర్నూలు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతామని తెలిపారు. అలాగే జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని కూడా ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్టా రాష్ట్ర నాయకులు కాకి ప్రకాష్‌రావు, ఆపస్ సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సేవాలాల్ నాయక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ఆపస్ జిల్లా అధ్యక్షుడు నాగారెడ్డి, నాగస్వామి నాయక్, మధుసూదన్ రెడ్డి, రాజ సాగార్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సంక్షేమ కోసం పాటుపడాలని ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశీ విశ్వనాథం అన్నారు. శనివారం గౌరీగోపాల్ హస్పటల్ సమీపంలోని సస్యా కాంప్లెక్స్‌లో ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా ప్రతి నిత్యం ఎదుర్కొనే ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం కోసమే ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా ఈ సమావేశాలు ఆరు, మూడు నెలలకు ఒక్కసారి ఉద్యోగుల సంక్షేమం కోసం నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. మొత్తం ఐదు జిల్లాల నుంచి ఈ సమావేశానికి ఆఫీసర్స్ హాజరయారని ఆయన తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకునేందుకు సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేసన్ చీఫ్ రీజినల్ సెక్రటరీ జి యా ఉర్ రహమాన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్, గులాటి పాల్గొన్నారు.

ఇంటి పన్ను, కరెంటు చార్జీలను తగ్గించండి


కాలనీ వాసులతో సమస్యలు తెలుసుకుంటున్న పుల్లారెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలో పేదలపై కూటమి ప్రభుత్వం విధిస్తున్న ఇంటి పన్ను, కరెంటు చార్జీలను తగ్గించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం 52వ వార్డు జిల్లా కోర్టు సమీపంలోని సాయిబాబా సంజీవయ్య నగర్‌లో కమిటీ బృందం పర్యటించారు. కాలనీలో పేదల నుంచి ప్రజలు విన్నవించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోజు కూలీపై జీవిస్తున్న పేదలపై కరెంటు చార్జీలు, ఇంటి పన్నుల భారం వేస్తే ఎలా బతకాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి పెద్ద తేడా లేదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏ. బాలరాజు, ఏ. పద్మావతమ్మ, పీపీఎస్ఎస్ నాయకులు ఏ. వెంకటేశ్వర్లు, రమణగౌడు, టి. కృష్ణ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు న్యూసిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేదాస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో గత నాలుగేళ్ల నుంచి ఆశ్రయం పొందుతున్న వెంకటేశ్వరరావు అనే వృద్ధుడు (65) శనివారం మృతి చెందాడు. మృతునికి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో వేదాస్ సంస్థ సభ్యులు పాతనగరంలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఇమ్రాన్ హోటల్ యజమాని టికే వాహీద్, కే.సందీప్ కుమార్, ఎం.ప్రభాకర్, కరుణమ్మలు పాల్గొని అంత్యక్రియలు నిర్వహించారు.

'నాలా'పై ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురుచూపు

కర్నూలు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాలా (వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు)పై ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నామని క్రెడాయ్ కర్నూలు ఛైర్మన్ గోరంట్ల రమణ తెలిపారు. నాలా పై రెవెన్యూ శాఖలోని వివిధ ఇబ్బందులను అధిగమించడానికి, నాలా తొలగింపుపై ప్రభుత్వం గతంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా రావాల్సిన ఉత్తర్వులలో జాప్యం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని క్రెడాయ్ రాష్ట్ర ఛైర్మన్ బుడిగె శ్రీనివాస్ రాష్ట్ర మంత్రి అనగాని ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాడాఉ. అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నాలా అంశంపై వారం రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారని గోరంట్ల రమణ పేర్కొన్నారు.

జగన్ మహిళలకు క్షమాపణ చెప్పాలి

కల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిపై సాక్షి లైవ్ డిబేట్‌లో మహిళలపై నీచంగా మాట్లాడిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ డిమాండ్ చేశారు. శనివారం ఆమె మాట్లాడుతూ మహిళలను అవమానించేలా సాక్షిలైవ్ డిబేట్‌ను ఆమె తీవ్రంగా ఖండించారు. వైసీపీ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అమరావతి రాజధానిపై దుష్ప్రచారమే లక్ష్యంగా మహిళల శీల హననానికి పాల్పడ్డారని, ఇది జగన్ చేయించారని ఆరోపించారు. స్వార్థపూరిత రాజకీయాల కోసం ఇంత నీచానికి దిగజారిన జగన్ వైఖరిని ప్రజలు మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు.

కరోనాలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి


గుత్తి పెట్రోల్‌బంక్ సమీపంలో సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

కల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని గుత్తి పెట్రోల్‌బంక్ సమీపంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూలు నుంచి విజయవాడకు, అలాగే తిరుపతి నుంచి కర్నూలుకు రైలు నడపాలని డిమాండ్ చేశారు. గత కరోనా సమయంలో రద్దయిన ప్యాసింజర్ రైళ్లు అన్ని తిరిగి అదే సమయానికి నడిచేలా పునరుద్ధరించాలన్నారు. కర్నూలు టు గుంతకల్ మీదుగా ముంబైకి ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను నడపాలని, డెమో ట్రైన్లలో బాత్రుం, లెట్రిన్ వసతులు కల్పించాలని సూచించారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు బస్సుల్లో వెళ్లాలంటే అధికంగా చార్జీలు అయ్యే అవకాశం ఉందని ప్రజల భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నల్లన్న, గిడ్డయ్య, మహేష్‌బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సారా బట్టీలపై పోలీసుల దాడులు

ఓర్వకల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమితం తండాలో నవోదయం-2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులో 900 లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ మాట్లాడుతూ నాటుసారా వలన వచ్చే అనర్థాల గురించి పూర్తిగా నాటుసారాను నిర్మూలించాలని, నాటుసారా లేని గ్రామంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ దీనిలో భాగస్వాలులు కావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రామలింగ చంద్రపాల్, ఈరన్న, రాజు, శ్రీనివాసగౌడు, మధు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్


గూడూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఓర్వకల్లు /సి.బెళగల్/ గూడూరు: జిల్లాలో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాను స్మరించారు. మతపెద్దలు పండుగ ప్రాశస్త్యాన్ని వివరించి ప్రపంచం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. త్యాగం బక్రీద్ సారాంశమని అన్నారు. ప్రతి ఒక్కరూ త్యాగ గుణం అలవర్చుకోవాలని అన్నారు. రంజాన్ మాసం ముగిసిన 70రోజుల తర్వాత దైవప్రవక్త త్యాగ్యాన్ని స్మరిస్తూ బక్రీద్ వేడుకలను జరుపుకొంటున్నట్లు చెప్పారు. ఇదిలావుంటే బక్రీద్ పండుగ సందర్భంగా సాంప్రదాయ దుస్తులతో ధరించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా మతసామరస్యంతో బంధుమిత్రులను తమ ఇళ్లకు ఆహ్వానించి ఆతిథ్యమిచ్చారు.


సి.బెళగల్, ఓర్వకల్లులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జాతీయ ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

పెద్దకడుబూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రతిభా పురస్కారం కింద కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనం పొందేందుకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు 12 మంది ఎంపిక అయ్యారు. శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ రంగన్న మాట్లాడుతూ వీరికి నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం లభిస్తుందన్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. వీరికి సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా మెడల్, ప్రశంసాపత్రం రూ.20 వేల నగదును అందజేస్తారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అభినందించారు.

వాహనాల తనిఖీ

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వాహనాలను రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తనిఖీ చేశారు. అతివేగంతో వాహనాన్ని నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోరాదన్నారు. కుటుంబంలో వ్యక్తిని కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే వాహనాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలడోనలో మద్యం

మంత్రాలయం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామంలో మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుండుపోగుల నేపాల్ ఆరోపించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పది బెల్టు షాపులు నిర్వహిస్తున్నా పట్టించుకునే వారు లేరన్నారు. గ్రామంలోని టీడీపీ నాయకులు ఒక్కొక్క బెల్టు షాపునకు రూ.2లక్షలు వసూలు చేసి షాపుకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకుని నివారించాలని డిమాండ్ చేశారు.

బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే నిర్వహించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో అడివన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మే8, 9వ తేదీలలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌తో జరిగిన చర్చల్లో సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు బదిలీలల్లో మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆన్లైన్ ద్వారా బదిలీల వెబ్ అప్షన్ నిర్వహిస్తామనడం సబబు కాదని అన్నారు. బదిలీల సమస్యలు పరిష్కరించకుండా మొండి పట్టుదలతో వెబ్ అప్షన్ ప్రక్రియ నిర్వహిస్తే ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ద్వారా దానిని బహిష్కరిస్తామని అప్పటికి దిగి రాకపోతే డీఈవో కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ కార్యదర్శులు నాగరాజు, ప్రసన్నరాజు, యల్లప్ప, బాబయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిని పరామర్శించిన తిక్కారెడ్డి



ఆదినారాయణశెట్టిని పరామర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కోసిగి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కోసిగి టీడీపీ సీనియర్ నాయకులు మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు పెండ్యాల ఆదినారాయణశెట్టి అనారోగ్యంతో హైదరాబాదులోని సన్‌షైన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండటంతో కర్నూలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి శనివారం హైదరాబాదులోని హాస్పిటల్‌కు చేరుకుని ఆదినారాయణశెట్టిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత డాక్టర్లను తమ నాయకుడి ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీసి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం తిక్కారెడ్డి మాట్లాడుతూ త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

విశాఖ ఉక్కు ఉద్యమాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్షుడు గోవిందు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏసేపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు, ఐఎఫ్‌టీయు తాలూకా నాయకులు బాలరాజు, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు సత్యన్న, జయన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు గుండెకాయ లాంటి పరిశ్రమ అయిన ఉక్కు పరిశ్రమ విశాఖ ఉక్కు దేశంలోనే అతి పెద్ద పరిశ్రమగా చరిత్రలో ఉండాలని ఈ పరిశ్ర మను కాపాడుకోడానికి ఎంతో మంది ప్రాణాలు తెగించి ఆంధ్రులకు ఆస్థిగా ఇచ్చారని తెలిపారు. నేడు బిజేపీ ప్రభుత్వం విశాఖపట్నం పరిరక్షణ కోసం ఎలాంటి ప్యాకేజి ఇవ్వకపోవడం బడ్జెట్ కేటాయించకపోవడం తదితర అంశాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. నెల క్రితం 2500 మంది కార్మికులను ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విశాఖ ఉక్కును ,కార్మికులను కాపాడుతామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని బడ్జెట్ కేటాయిస్తామని కార్మికులను ఆదుకుంటామని బహిరంగ సభలో హామీ ఇచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకం డిమాండ్లు సాధనకై జూన్9న రాష్ట్రవ్యాప్తంగా జరిగే విశాఖ పరిరక్షణకై ఉద్యమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు

త్యాగాలకు ప్రతీక బక్రీద్

● త్యాగం, విశ్వాసమే ఇస్లాం అని చాటిన మత పెద్దలు
● ఈద్గాలు, మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
● పోలీసుల బందోబస్తు



పెద్దకడబూరులో బోధన చేస్తున్నమతగురువు



కోసిగిలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్నముస్లింలు



కౌతాళం ఖాదర్ లింగస్వామి దర్గాలో ఫాతెహలు తక్‌బీర్ చదువుతున్న పీఠాధిపతి

పెద్దకడుబూరు జూన్ 7 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరుతో పాటు ఆయా గ్రామాల్లో ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. ఉదయం నుంచి ఈద్గా, మసీదుల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

కోసిగి వేడుకల్లో పాల్గొన్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి

త్యాగానికి, సత్యానికి ప్రతీక బక్రీద్ పర్వదినం అని, ముస్లింలకు ఎంతో ప్రత్యేకమైన రోజు అని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం కోసిగిలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని కోసిగిలోని రైల్వేగేటు సమీపంలోని ఈద్గా వద్ద మండలంలోని ఆయా గ్రామాల ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీరికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దలకు, ముస్లిం మత గురువు జాకీర్ మౌలానాకి శుభాకాంక్షలు తెలిపారు

నందవరం:

మండలంలోని ముగతి, నందవరం, కనకవీడు, నాగలదిన్నె, నదికైరవాడి తదితర గ్రామాల్లో శనివారం ముస్లింలు ఘనంగా బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకంతా ఆయా గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల దగ్గరికి చేరి ప్రత్యేకంగా నమాజ్ చేసుకుని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. నందవరంలో టీడీపీ నాయకులు గురురాజారావు ముస్లింల కోసం ప్రత్యేకంగా పాటు పడుతుండడంతో ఆయనను నందవరం ముస్లింలు సన్మానించారు.

కౌతాళం:

త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండుగను మండలంలో ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముఖ్యంగా మండల కేంద్రమైన కౌతాళం ఖాదర్ లింగస్వామి దర్గాలో పీఠాధిపతి సయ్యద్ పెద్ద మున్నా పాష దర్గాలో బక్రీద్ ప్రత్యేకతను, విశిష్టతను ప్రజలకు తెలియజేసి ప్రత్యేక నమాజును చేయించారు.

ఎమ్మిగనూరు టౌన్:

ఎమ్మిగనూరు పట్టణంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినాన్ని జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం వైఎస్ఆర్ సర్కిల్ రోడ్డులో, కమిటీ రోడ్డులో గల ఈద్గాలో మత గరువు సయ్యద్ మహమ్మద్ హాస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు పండుగ సందర్భంగా పట్టణంలోని కొంత మంది నిరుపేదలకు అవసరమైన నిత్యవసర సరుకులు అందజేశారు. ఈద్గాలో మత పెద్దలు ప్రభుత్వ ఖాజీ మిర్జా ఖైదుల్లా బేగ్, యూసఫ్ మదిని తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల:

భక్తి, త్యాగమే ఇస్లాం మతం. మన చుట్టు ఉన్న వారిని ప్రేమతో చూడటమే దైవాన్ని ప్రేమతో చూడటం అని గోనెగండ్ల ముజావర్లు రహిమాన్, రహీం, మాబు అన్నారు. బక్రీద్ పండుగను పురష్కరించుకొని శనివారం గోనెగండ్లలోని ముస్లింలు జామీయా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ విజయభాస్కర్ గట్టిబందోబస్తు నిర్వహించారు.

ఎమ్మిగనూరు రూరల్:

ఎమ్మిగనూరు మండలంలో ఆయా గ్రామాల్లోని ముస్లీం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను శనివారం ఆయా గ్రామాల్లోని ముస్లింలు ఉదయం నుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

మంత్రాలయం:

నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం, మాధవరం, మాలపల్లి, రాంపురం, వగరూరు, సూగూరు, వి.తిమ్మాపురం, తుంగభద్ర, చిలకలడోన గ్రామాల్లో బక్రిద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం జామీయా మసీదు, ఈద్గా వద్ద ఇమాం ఖాజా బందె నమాజ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ పురవీదుల గుండా ర్యాలీగా వెళ్లి ఈద్గాలకు చేరుకుని త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ ప్రాముఖ్యతను మత పెద్దలు చదివి వినిపించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, మాధవరం ఎస్ఐ విజయకుమార్ బందోబస్తు చేపట్టారు



ఎమ్మిగనూరులో ప్రార్థనకు హాజరైన ముస్లింలు



మంత్రాలయం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గోనెగండ్లలో పండుగ గురించి వివరిస్తున్న మత పెద్దలు

అనుమతిలేని మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంతో సీఐ రమేష్ రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం గ్రామ శివారులో కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ అధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మిగనూరు ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ రమేష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్ రమేష్ నాయక్ (42) పర్మానుదొడ్డితండాకు చెందిన వ్యక్తి కర్ణాటక నుంచి 96 ఒరిజనల్ చాయిస్ విస్కీలు టెట్రా ప్యాకెట్‌లు (90ఎంఎల్) అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో మద్యం విలువ రూ. 46000. వారిని ఎస్ రమేష్ నాయక్ అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాముడు, హెచ్‌సీ గోపాల్, కరుణాకర్ పాల్గొన్నారు.

32వ రోజుకు సమ్మె

● పండుగ రోజు కూడా సమ్మెలో పాల్గొన్న ముస్లింలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 32వ రోజు సమ్మె కొనసాగించారు. సమ్మెలో ముస్లింలు పండుగను కూడా లెక్క చేయకుండా సమ్మెలో పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో ఏసేపు, అనీఫ్, డానియల్, రాజేంద్ర, నరసప్ప ,విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్, భాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు. మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ పూర్తి స్థాయిలో సమ్మెలో పాల్గొనడంతో వీధి దీపాలు వెలగక, తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

శ్రీమఠంలో నిత్యపూజలకు విరామం



అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనం

మంత్రాలయం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. శనివారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం నిర్వహించి మూల రాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు. వేలాది మంది భక్తులకు పీఠాధిపతి తప్త ముద్రదారణ చేశారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి కడపకు చెందిన రామకృష్ణయ్య అనే భక్తుడు రూ.1,00,116 విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానంకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబాన్ని పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

భక్తులతో మార్మోగిన తుంగాతీరం

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో తుంగభద్ర నదీ తీరం సందడిగా మారింది. శనివారం బక్రీదు, ఆదివారం వరసగా రెండు రోజులు సెలవు దినాలు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.. ఏకాదశి కావడంతో శ్రీమఠంలో అన్నదానం లేకపోవడంతో హోటళ్లు భక్తులతో కిక్కిరిశాయి. రథోత్సవాలు, పరిమళ ప్రసాదం లేకపోవడంతో భక్తులు నిరుత్సాహానికి గురయ్యారు



శ్రీ మఠం ప్రాంగణంలో భక్తులు రద్దీగా ఉన్న దృశ్యం

అంజన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలను చేశారు. ముఖ్యంగా బుడుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, ఆగసలదిన్నె ఆంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు తెల్లవారుజామునే మూలవిరాట్‌కు శుద్ధజలాలచే అభిషేకం జరిపి ప్రత్యేక ఫలపుష్పాలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. బుడుముల దొడ్డి ఆంజనేయస్వామికి పలికే దేవుడిగా పేరు ఉండటంతో ఈ దేవాలయంలో ఆకుపూజకు ప్రత్యేకత ఉంది. తరువాత దేవాలయంలో సీతారాముల వారిని ప్రత్యేక రథంపై దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయించి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చల్లబడ్డ వాతావరణం

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో గత 15 రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది మేనెలలోనే ముందస్తు వానలు రావడంతో రైతులు పత్తి పంటను సాగు చేశారు. అయితే పత్తి విత్తనం నాటి 15 రోజులు అయినా వర్షం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా మూడు రోజుల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులకు గురయ్యారు. శనివారం సాయంత్రం వరుణ దేవుడు కరుణించడంతో వాతావరణం కొంత చల్లబడింది. దీంతోరైతులు, ప్రజలకు కొంత ఉపశమనం లభించినట్లయ్యింది.

చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే



అగ్రహారం గ్రామంలోని వీధిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఎమ్మెల్యే బీవీతో అగ్రహారం టీడీపీ నూతనగ్రామ కమిటీ సభ్యులు

గోనెగండ్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబానాయుడు పాలనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం బీ అగ్రహారం గ్రామంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పర్యటించారు. గ్రామంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ లతో పాటు మిగతా కాలనీల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని, బీసీ కాలనీలో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని నీటి ట్యాంక్‌ను బీవీ పరిశీలించారు. నీటి సమస్యకు స్పందించిన ఆయన జూలై నెల మొదటివారం లోపు జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని పూర్తి అయిన వెంటనే గ్రామానికి తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం చర్చిలో ప్రార్థనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని ఈ కాలంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్రహారం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా సుభాషన్‌రెడ్డి

అగ్రహారం గ్రామ టీడీపీ కమిటీని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శనివారం గ్రామంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సుభాషన్‌రెడ్డి, కార్యదర్శిగా రంగన్న, ఉపాధ్యక్షుడిగా పాండు, కార్యదర్శులుగా తిరుమలనాయుడు, చంద్రన్న, రాఘవేంద్ర, ప్రతాపరెడ్డి, ఐటీడీపీ గ్రామ అధ్యక్షుడిగా రామనాయుడు ఎన్నికయ్యారు.

ట్యాంకును శుభ్రం చేశారు



ట్యాంకును శుభ్రంచేస్తున్న కార్మికుడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవనకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల వద్ద ఉన్న మంచినీటి ట్యాంకు అపరిశుభ్రంగా ఉన్న విషయాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రిక శనివారం 'శుభ్రతను పట్టించుకోరా!' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఇందుకు స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి రఫీ సిబ్బందితో శనివారం ట్యాంకును శుభ్రం చేయించారు. ఇకపై నీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందిస్తామని కార్యదర్శి తెలిపారు.

కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న

ఆదోని అగ్రికల్చర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని కోట్ల సర్కిల్‌లో చేస్తున్న రిలే దీక్షలు శనివారానికి నాలుగో రోజుకు చేరాయి. కార్మికులకు సీటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఈరన్న, అజయ్‌బాబు, పీఎస్ గోపాల్, నాగరాజు, యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు సునీల్ రాజ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని, టెక్నికల్ కార్మికులకు రూ.29,500, నాన్ టెక్నికల్ వారికి రూ.25,500ల వేతనం ఇవ్వాలన్నారు. దీక్షలో అహ్మద్, భరత్, ఈరన్న, రామాంజినేయులు ఆంజనేయులు, కుమార్, కర్రెప్ప, శరత్, శంకర్, మహమ్మద్, బసవరాజు, దేవేంద్ర, శివకుమార్ ఉన్నారు.

గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిక్షణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు, రచయిత సోమన్న

ఆలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో నెల రోజులపాటు నిర్వహించిన వేసవి శిక్షణ శనివారంతో ముగిసింది. బాల సాహితీవేత్త డా.గద్వాల సోమన్న రచించిన 'సూక్తి చంద్రిక' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పదో తరగతి టాపర్లకు బహుమతులు అందించారు. విశ్రాంత అధికారులు రామలింగమ్మ, శ్రీనివాసులు, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి విజయభాస్కర్, వీరస్వామి, ఈరన్న, దేవదానం, మాజీ సైనికుడు నర్సిరెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు మహదేవి పాల్గొన్నారు.

నల్లగుట్టలో వీరభద్రగౌడ్ పూజలు



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆస్పరి, జూన్7(ఆంధ్రజ్యోతి): అలిగెర గ్రామ సమీపంలోని కూర్మ నారాయణస్వామి నల్లగుట్ట క్షేత్రంలో టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ శనివారం పూజలు నిర్వహించారు. ఆలయానికి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేయాలని నాయకులను కోరారు. కన్వీనర్ పరమారెడ్డి, ఎంపీటీసీ రహంతుల్లా, మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రినాయుడు, కొంక మధు, రంగనాథ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపకారవేతనాలకు ఎంపిక



పారా సతీష్, నందిని, ప్రవీణ్ కుమార్

మద్దికెర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యాసాయి పాఠశాలల విద్యార్థులు పారా సతీష్, నందిని, అల్లం ప్రవీణ్ కుమార్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ఎంఈవో రంగస్వామి, కరస్పాండెంట్ వెంకట మాధవ, ప్రిన్సిపాల్ బాల సునీత తెలిపారు. శనివారం మాట్లాడుతూ 2024-25లో ఎంపికైన వీరికి ఇంటర్మీడియట్ వరకు నెలకు రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ నెల 9న కర్నూలులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ రంజిత్‌బాషా ప్రదానం చేస్తారన్నారు.

రోజూ యోగా చేయాలి

మద్దికెర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ యోగా చేయాలని టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సూచించారు. శనివారం పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ చేసి, మెయిన్ బజారులో మానవహారం నిర్మించారు. సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, చంద్రశేఖర్‌గౌడు, లక్ష్మీనారాయణ, వీరేష్ రంగన్న, పంచాయతీరాజ్ ఏఈ విష్ణు, తదితరులు ఉన్నారు.

వైసీపీ కౌన్సిలర్ల రాజీనామా డ్రామా



మధుసూదన్ శర్మ

ఆదోని, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తమ వార్డులో అభివృద్ధికి అధికారులు సహకరించడం లేదని వైసీపీ కౌన్సిలర్లు డ్రామా ఆడుతున్నారని బీజేపీ నాయకుడు వెల్లాల మధుసూదన్ శర్మ అన్నారు. శనివారం మాట్లాడుతూ ఏడు నెలల క్రితం వైస్ చైర్మన్‌కు కుర్చీలు వేయలేదని అడ్డుకొని తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎల్ఎల్‌సీలో నీరు ఉన్నంతవరకు కుర్చీల కోసం పోట్లాడారన్నారు. పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. మూడు నెలల క్రితం గత చైర్‌పర్సన్ శాంతను అవిశ్వాస తీర్మానం పెట్టి దింపేశారని, కౌన్సిలర్లను ప్రలోభాలు గురిచేసి లోకేశ్వరిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారని అన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- పేదలకు సాయం చేయాలని సందేశం ఇచ్చిన మత గురువులు
- నమాజ్ చేసిన ముస్లింలు



ఆదోని జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



పత్తికొండ ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెల్దుర్తిలో శుభాకాంక్షలు తెలుపుకుంటూ..



ఆలూరు ఈద్గా వద్ద నమాజ్



దేవనకొండలో సందేశమిస్తున్న మతపెద్ద

ఆదోని అగ్రికల్చర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బక్రీద్‌ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్డులోని 60మసీదులలో ఈద్ నమాజ్ చేశారు. షాహి జామియా మసీద్ గురువు కతీబ్ సాబ్ జునేద్ హస్మి మాట్లాడుతూ ప్రవక్త ఇబ్రహీం త్యాగం ఆదర్శనీయమన్నారు.

పత్తికొండ: స్థానిక ఈద్గావద్ద మతపెద్దలు ఖురాన్ అంశాలను బోధించారు. బక్రీద్ దానధర్మాలకు ప్రతీకను పేదలకు సాయం చేయాలని సూచించారు. పట్టణంలోని తేరుబజార్ పెద్దమసీదును విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆలూరు: పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు నమాజ్ చేశారు. మత గురువులు సందేశం అందజేశారు.

దేవనకొండ: స్థానిక ఈద్గాకు ర్యాలీగా ఈద్గాకు చేరుకుని నమాజ్ చేశారు. తుగ్గలి, క్రిష్ణగిరి, చిప్పగిరి, మద్దికెర, వెల్దుర్తి మండలాల్లో వేడుకలు నిర్వహించారు.

ఇది కాదా అభివృద్ధి ?

- వైసీపీ నాయకులను ప్రశ్నించిన టీడీపీ నాయకులు



మద్దికెర-బురుజుల బీటీ రోడ్డును చూపుతున్న నాయకులు

మద్దికెర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులకు టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా? అని మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడ్, నాయకులు ఎస్.లక్ష్మినారాయణ ప్రశ్నించారు. శనివారం మద్దికెర నుంచి బురుజుల వరకు రూ.5 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించారు. గత వైసీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఏళ్లుగా అధ్వానంగా ఉన్న బురుజుల రోడ్డును నిర్మించారన్నారు. గతంలో రోడ్డుపై గుంతలు, మలుపులతో పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పట్టుబట్టి నూతన రోడ్డును వేయించారన్నారు. మండలంలో మరో రూ.5 కోట్ల అభివృద్ధి పనులు చేశరని, వైసీపీ నాయకులు అభివృద్ధి జరగడంలేదని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ హయాంలో ఒక్క మట్టిరోడ్డు కూడా వేయలేకపోయారనిఆరోపించారు. మీసేవా భీమరాజు, గడ్డం రామాంజులు, ఎస్.ఉదయ్ కుమార్, ఆకుల నాగరాజు, నెట్టేకల్లు, తదితరులు ఉన్నారు.

రైతు అభివృద్ధే టీడీపీ ధ్యేయం

- వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసిన నాయకులు



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, తెలుగురైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి అన్నారు. శనివారం తుగ్గలిలో ఏవో పవన్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వైసీపీ దగాతో రైతులు నష్టపోయారని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ పరికరాలు, స్ప్రింకర్లను వందశాతంతో సబ్సిడీతో ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు మండలానికి 1605 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వచ్చాయని వచ్చాయనీ, రాయితీతో క్వింటం రూ.5,580లకు ఇస్తున్నామన్నారు. విత్తనాలు వేసే సమయంలో ఖచ్చితంగా విత్తనశుద్ధి పాటించాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, వెంకటేశ్ మాజీ వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్, బాలన్న, వల్లె వెంకటేశ్, సర్పంచ్ రవి, హనుమంతు, మైరాముడు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

జోనల్ క్రికెట్ పోటీలకు ఆదోని క్రీడాకారులు



క్రీడాకారులతో తాలూకా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

ఆదోని అగ్రికల్చర్ , జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అండర్-15 అండర్ -19 జోనల్ అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌కు పట్టణానికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్ తెలిపారు. శనివారం క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్థానిక భీమాస్ హాల్లో అభినందించారు. బాలికల జట్టుకు జోష్న, మేఘనా రెడ్డి ఈనెల 9 నుంచి 15వరకు నెల్లూరు జిల్లాలో జరిగే ఐదు జిల్లాల జోనల్ క్రికెట్ పోటీలలో జిల్లా తరఫున ఆడతారన్నారు. అలాగే అండర్-19 ఈనెల 10నుంచి 16వరకు కడపలో జరిగే జోన్ అంతర్ జిల్లాల పోటీలలో అక్షయ రవితేజ, ఫాస్ట్ బౌలర్లు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ముజీబ్ అహ్మద్, వెంకటేష్, బాషా, కోచ్ బాలాజీ పాల్గొన్నారు.

నాబార్డు నిధులతో రోడ్డు



రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్

హొళగుంద, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి చిన్నహ్యాట గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైనట్లు పీఆర్ఐ ఏఈ వాసుదేవ్ మూర్తి తెలిపారు. అరికెరా తండా క్రాస్ నుంచి ఆలూరు వరకు ప్యాచ్ వర్క్, ముద్దనగేరి గ్రామం వద్ద సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నామని, మూడేళ్ల క్రితం వేసిన ప్యాచ్‌వర్క్ మినహాయించి, మిలిగిన రోడ్డుకు రూ.4.6కోట్లతో పనులు శనివారం ప్రారంభించామని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య



జెండాను ఆవిష్కరిస్తున్న గిడ్డయ్య

పత్తికొండ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆరోపించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. మత విద్వేషాలు చెలరేగుతున్నాయని, మతోన్మాదులు మత కల్లోలాలు సృష్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. అనంతరం నాయకులు బొజ్జప్ప, మద్దిలేటిని సన్మానించారు. కార్యదర్శిగా హనుమంతు, సహాయ కార్యదర్శిగా గోపాల్‌ను ఎన్నుకున్నారు. రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా నాయకులు కారుమంచి గ్రామ నాయకులు గిడ్డయ్య గౌడు, కాశీ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ దాణా పంపిణీ

మద్దికెర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ పశువుల దాణాను పశువైద్య సచివాలయ అధికారి అరుణ కుమారి శనివారం పంపిణీ మండలానికి 175 క్వింటాళ్ల దాణా వచ్చిందని, 50 కిలోల బస్తాను రూ.560ల ప్రకారం ఇస్తామన్నారు. పశువులకు ఒట్టి మేతతో పాటు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో దాన ఇస్తే, పాలు అధికంగా ఇస్తాయన్నారు.

మార్కెట్‌లోకి వెళ్లాలి

- డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్‌రావు

ఆలూరు, జూన్7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్డు పక్కనే మాంసం విక్రయిస్తున్న వ్యాపారులు ఇకనుంచి సంత మార్కెట్‌కు వెళ్లాల్సిందేనని డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు సూచించారు. పశువైద్యులచే పరీక్ష చేయించకుండానే గొర్రెలు, మేకలను వధిస్తే జరిమానా విధిస్తామని, రోడ్డుపక్కనే మాంసం విక్రయిస్తే దుమ్ము, ధూళి పడే అవకాశం ఉందన్నారు. వ్యాపారులు సంతకు వెళ్లకుంటే బలవంతంగా తరలిస్తామని హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య

ఆదోని, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సంతానం కలుగలేదని జీవితంపై విరక్తి చెంది వివాహిత రైలు కిందపడి శనివారం ఆత్మహత్య చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపిన మేరకు.. కౌతాళం మండలంలోని ఓ గ్రామానికి చెందిన చిన్న వెంకటేష్, చిట్టెమ్మ(38)కు 15ఏళ్ల క్రితం పెళ్లయింది. పిల్లలు కలగకపోవడంతో మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వైద్యం చేయించినా నయం కాలేదు. ఆరేళ్ల క్రితం భర్త వెంకటేష్‌కు ప్రమాదంలో కుడికాలు విరిగిపోయింది. దీంతో ఆమె జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గురుకులానికి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయురాలు కళ్యాణి

పత్తికొండ, జూన్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెఎం.తండా ప్రభుత్వ పాఠశాలకు చెందిన 7 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయురాలు కల్యాణి శనివారం తెలిపారు. జశ్వంత్‌నాయక్ (పత్తికొండ), వరుణ్‌నాయక్ (పత్తికొండ), శశిధరనాయక్(కడప), అక్షితాబాయి (పత్తికొండ), అమూల్య(ఆరెకల్), అవంతిక(ఆరెకల్), యోగేంద్ర నాయక్(శ్రీశైలం) గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కేక్ కట్‌చేస్తున్న విద్యార్థులు

పత్తికొండ, జూన్7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యశోదా పాఠశాల (శ్రీచైతన్య) పదో తరగతి విద్యార్థులు ప్రతిభా పురస్కారాలను ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అధేరా క్రిష్ణన్ తెలిపారు. పదో తరగతిలో ప్రతిభ చూపినందుకు ప్రభుత్వం రూ.20వేలతోపాటు, జ్ఞాపిక అందజేస్తుందని విద్యార్థులు లింగం సోమేశ్వరరెడ్డి, పి.కావ్య, మహేంద్ర, పి.రాకేష్‌ను ఆయన అభినందిచాఆరు.

రైళ్లను పునరుద్ధరించాలి



సంతకాలను సేకరిస్తున్న నాయకులు

ఆదోని రూరల్, జూన్ 7 ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు అజయ్ బాబు, సుదర్శన్, కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద సంతకాలను సేకరించారు. ఆదోని రైల్వేస్టేషన్‌కు ఎంతో చరిత్ర ఉందన్నారు, ఇక్కడి నుంచి ఎంతో మంది ప్రయాణికులు వెళుతుంటారని రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.

రాజవంశీయులకు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

మద్దికెర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో బక్రీద్, రంజాన్ సందర్భంగా ముస్లింలు యాదవరాజ వంశీయులకు శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీగా వస్తోంది. మద్దికెర మోమెన్ వీధికి చెందిన ముస్లింలు నమాజ్ అనంతరం పెద్దనగరికి చెందిన యాదవరాజుల ఇంటికి వచ్చారు. రాజు దుస్తులు, ఖడ్గంతో ఉన్న యాదవరాజులు ముస్లింలను ఆప్యాయంగా పలకరించి తాంబూలాలను ఇచ్చి పంపారు. కోఆప్షన్ మాజీ సభ్యుడు సత్తార్, షమీర్, హుశేన్, బాషా, సైకిల్ షాపు బాషా, తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల పనితీరు మెరుగుపరుస్తా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు ఎంపీడీవో మద్దిలేటిస్వామి



ఆలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల పనితీరును మెరుగు పరుస్తామని ఆలూరు ఎంపీడీవో మద్దిలేటిస్వామి తెలిపారు.

ప్రశ్న: కొందరు సచివాలయ ఉద్యోగులు విధులకు సకాలంలో రావడం లేదనే విమర్శలు ఉన్నాయి?
జవాబు: ఇప్పటికే ఆలూరులో ఐదు మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తాం.
ప్రశ్న: తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారా?
జవాబు: పట్టణంలో వాటర్‌మెన్ అందుబాటులో లేక తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగింది. వారితో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరిస్తాం.
ప్రశ్న: యోగాంధ్రలో ఎంతమందిని భాగస్వాములను చేశారు?
జవాబు: మండలానికి లక్ష్యం 26వేలు కాగా, ఇప్పటి వరకు 18 వేల మందిని నమోదు చేయించి, శిక్షణ ఇస్తున్నాం.
ప్రశ్న: మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ కొనసాగుతోందా?
జవాబు: స్త్రీ శక్తి భవనంలో శిక్షణ కొనసాగుతోంది. 20 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు.
ప్రశ్న: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తున్నారా?
జవాబు: తహసీల్దార్, ఎంఈవోతో పాటు ఎంపీడీవోతో కలిసి త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షించాలి. పాఠశాల ప్రారంభమయ్యాక తనిఖీ చేసి మెనూ ప్రకారం భోజనం అందేలా చూస్తాం.